# అవధాని

రచన :- కంఠంనేని రాధాకృష్ణమూర్తి.

## 1

ఉలికి పడ్డట్టు చటుక్కున "బేంజూ" మూగవోయింది. "ఏమిటిరాఘవా?" చీకట్లోంచి అవధాని స్వరం పలికింది. "నీలో మగతనం లేదని జన మనుకుం టున్నారోయ్!"

సమాధానంగా "బేంజూ" తీగలు బరువుగ రెండుసార్లు మూలిగాయి. వాళ్ళు ముగ్గురూ వరండాలో పండుకుని ఉన్నారు. సత్యం మంచానికి రెండువైపులా వాళ్ళిద్దరి మంచాలు. చీకటి కరెంటుపోయి అరగంట దాటినా ఇంతవరకు అతీగతీ లేదు. బయట "ఈ" మంటూ గాలులు విసురుతున్నాయి. ఈపక్కనుంచి ఆ పక్కకు ఢమ్ములుదొర్లిస్తున్నట్లు పైన ఉరుములతో మబ్బులు కదలిపోతున్నాయి. ఉండి ఉండి ఒక మెరుపు తళుకు మంటోంది.

వర్షం మాత్రంలేదు.

"మరి నీఉద్దేశమేమిటి?" అవధాని గొంతులో దిగులు ధ్వనించింది.

"అబద్ధ మాడదల్చుకోకపోతే డిటో."

సత్యం పక్కకు తిరిగి బోర్లా పండుకున్నాడు, బుజాలపక్క చేతులు రెండూ ముడిచి రెట్టంపైన అరచేతి వెనకభాగాన గడ్డమానించి చీకట్లోకి చూచాడు.

ఎదురుగాకొండలపైన మబ్బులు మధ్యనుంచి తళుక్కున ఒక వంపుల గీత గీయబడింది. వెలుగులో అవధాని మంచం క్రిందకు వంగటాన్ని సత్యం కళ్ళ చివర్లనుంచి గమనించాడు. అవధాని 'బేంజూ' ను చెక్క పెట్టెలో పెట్టేస్తున్నాడు, అది అతని ప్రియమైన వస్తువు. అతని మనస్సు వికలమైందని తెలుస్తోనే ఉంది.

మూడు సంవత్సరాల క్రితం వాళ్ళు ముగ్గురూ పూర్తిగా అపరిచితులు. ప్రాజెక్టులో చేరాక ఉద్యోగ రీత్యా ఒకరికొకరి అవసరం ఉండటంవల్ల ముగ్గురికీ స్నేహమేర్పడింది. ప్రాజెక్టు ప్రారంభదశలో ఉండటంవల్ల వాళ్ళకు విడివిడిగా

క్వార్టర్లు దొరకకపోవడంతో, అంతకుముందు ఎవరెక్కడ నివసించినా, సంవత్సరం నుండి ముగ్గురూ ఒకే క్వార్టర్లో ఉండటం వాళ్ళస్నేహాన్ని తప్పనిసరిచేసింది. అవధాని గారేజిలో జూనియర్ ఇంజనీరు. రాఘవ ట్రాన్స్పోర్టులోను సత్యం సెంట్రల్ స్టోర్సులోను సూపర్వైజర్లు.

సత్యానికి నిద్రపట్టటం లేదు. అతని ఆలోచనలు ఎటెటో పరుగులు తీస్తున్నాయి... మూడు నెలల క్రితం — సెలవుపెట్టి సత్యం యింటికి వెళ్ళాడు అతను లేనప్పుడు. వాళ్ళక్వార్టర్లో జరిగిన సంఘటన తిరిగి వచ్చాక అవధాని పూసగుచ్చినట్లు చెప్పాడు.

ఆరోజు అవధానికి ఎవరో తన భుజం తట్టి కుదుపుతుంటే ఒకరాత్రివేళ మెలకువ వచ్చింది. ఎదురుగా రాఘవ.

" మిత్రమా నీతో ఒక సహాయం కావాలోయ్! " అంటున్నాడు'

" ఇంతరాత్రివేళా? " ఆశ్చర్యంతో కళ్ళునులుముకుంటూ అన్నాడు అవధాని.

" అరె భాయ్, నువ్వెంతో మంచివాడివిగ! " బతివాలుతున్నట్లు అన్నాడు రాఘవ.

" అసలు సంగతేమిటో చెప్పరాదూ? "

రాఘవ వంగి రహస్యంగ అన్నాడు.

" ఈ రాత్రికి ఒక స్త్రీని తెచ్చుకున్నాను నువు కాస్త గది ఖాళీ చేస్తే..."

దెబ్బకు అవధాని నిద్రమత్తు వదలిపోయింది. అతని గుండెలో లబ్‌డబ్‌లు డబడబ మన్నాయి. రాఘవ కన్నుమీటి అంటున్నాడు.

" కాకినాడ సరుకు. ఈసారి యస్. ఐ. కి సరిగ ముట్టలేదంట. పోలీసుల గొడవజాస్తిగ ఉండటంవల్లఇక్కడికి తీసుకు రావటంతప్పనిసరి అయింది ప్లీజ్...

బుష్ షర్టు ఒకటి భుజాన వేసుకుని అవధాని బయటకి నడుస్తుంటే తలుపు పక్కన ఒదిగినిల్చున్న ఒక స్త్రీ రూపం కనిపించింది.

రోడ్డువరకు వెనకే వచ్చిన రాఘవ అన్నాడు.

భాయీ అవసర మనిపిస్తే ఓగంట తర్వాతరా. నీకోసమూ ఉంచుతాను. "

ఈసంగతి చెబుతూ అవధాని అన్నాడు.

" అదికాదు సత్యం, నాకెంత అసహ్యామేసిందని! వేశ్య అన్న ఒక్క ఏవగింపేకాక, ఒక్క స్త్రీని ఒకేరాత్రి ఇద్దరు పురుషులు.... ఛీఛీ!! ఆరాత్రి ఎక్కడకు

పోవాలో తెలియలేదు. అర్ధరాత్రి దాటుతుంది. అలారోడ్డునే వెళ్ళి చెక్‌పోస్టు దాటి ఎంతదూరమో నడుచుకుంటూ వెళ్ళాను, ఒక చెట్టుకిందపడుకుని చల్లగాలిలో అలాగే నిద్రపోయాను. తెల్లారి సూర్యరశ్మి కళ్ళలో పొడుస్తుంటేగాని మెలుకవ రాలేదు....

కాని రాఘవ ఇదే విషయాన్ని ఇంకో దురాన్నుంచి చూసాడు.

" అరె, వేశ్య అయితేమట్టుకు మనిషికాదా? సరే, ఈపబ్లిక్ లం జ ల సంగతి వదిలేద్దాము, మరి చాటున, పక్కల్లోకి ఎవరెవరినో తెచ్చుకునే సంసార వేశ్యలసంగతి? .... భాయీ, ఈకబుర్లన్నీపైపైవి. అసలు సంగతి అవధానిలో మగతనంలేదు మొన్న అతనికి సమ్మంధం తీసికొచ్చిన వాళ్ళబాబాయి కూడా ఉన్నాడా, " నిజంగా వీడసలు మగవాడే అయితే ఇన్ని సంబంధాల్ని తిరస్కరిస్తూ పెళ్ళెందుకు చేసుకోనంటాడు? " అని అవును ఇతనెందుకని పెళ్ళికి వప్పుకోడు? ఉద్యోగమా పర్మినెంటు అయిపోయింది, వివాహితుడుగా అప్లికేషను పెట్టుకుంటే క్వార్టరు దొరుకుతుందన్నది తెలిసిన విషయమే. మరేమిటి అభ్యంతరాలు? ... ఈ ధోరణిలో.

అతని మగతనం విషయంలో కాకపోయినా అవధాని జీవితంలో ఏదోమిస్టరీ దాగి ఉందని సత్యానికి అనిపించింది.

" నిద్రపోయావా సత్యం? " – అది అవధాని గొంతక.

" లేదు. నీలాగే.... "

సత్యం కుడివైపు మంచంమీద కదలికలేదు. రాఘవ నిద్రపోయినట్టున్నాడు తను రేపిన గాయం ఎదుటి హృదయంలో ఎంతటికల్లోలాన్ని సృష్టించిందో అతనికి తెలియదు. ప్రతివిషయాన్ని చాలా తేలికగ తీసుకుంటాడతను.

చిట చిట శబ్దమయింది బయట. చినుకులు ఆవెంటనే పరుగెత్తుకొచ్చినట్లు వర్షం ఒక్కసారిగా పెద్దదయింది.

చ లి గా లు లు విసురసాగాయి. సత్యం దుప్పటి తీసి మెడవరకు కప్పుకున్నాడు.

" మాఅమ్మకు నేనొక్కణ్ణె కొడుకును. "

" ఏమిటీ? " అన్నాడు వినిపించక సత్యం.

" మా అమ్మకు నేనొక్కణ్ణే కొడుకును "

" ఆహాఁ... "

" స్వల్పాధారాలు కారణంగా ఈమనుషులు అంత త్వరగా ఒక నిర్ణయాని

కెలా వస్తారో అర్థంకాదు. ... "

సత్యం మాట్లాడలేదు. దూరాన ఎక్కడో ఉరిమింది మరుక్షణాన్నే కళ్ళను మిరుమిట్లుగొలిపే ఒక తళుకు.

" మానాన్న నాచిన్నప్పుడే చనిపోయాడు ... వింటున్నావా సత్యం? " అడిగాడు అవధాని.

" ఊఁ. చెప్పు, చెప్పు...."

నన్ను తీసుకుని వచ్చేసి అమ్మ అప్పణ్ణించీ మాబాబాయి వాళ్ళింట్లో స్థిరపడి పోయింది. మానాన్న మిగిల్చిపోయినఆస్తే మాకు సరిపోయేఉంది. కానిసమాజంలో ఒక అబల పసివాడ్ని పెంచుతూ పరువుగా, నిరపాయంగా బ్రతకాలంటే ఏదో ఒక ఆధారం అవసరం. అందుకనే మేము బాబాయి నాశ్రయించవల్సివచ్చింది. కాని .... సరే, అదంతా అప్రస్తుతం అనుకో ... తర్వాత పెద్దవాణ్ణయి ఇంజనీరింగు చదువుతున్నప్పుడు. నేనూ ప్రేమలో పడ్డాను. ...."

సత్యానికి కుతూహలం కలిగింది. వర్షం చప్పుడులో అవధాని స్వరం సరిగా వినిపించటం లేదు.

" కాస్త బిగ్గరగా మాట్లాడరాదా? " అన్నాడు.

అవధాని స్వరం హెచ్చించాడు

మా వీధిలోనే ఉండేదా అమ్మాయి. రోజూ నేను కాలేజీకి వెళ్తుంటే కనిపించేది. చక్కటి మొహం ఎప్పుడూ స్లీవ్‌లెస్ జాకెట్లు వేస్తుండేది. ఆమె మొహం కంటె నన్నెక్కువగా ఆకర్షించింది ఆమెచేతులు. బుజాల గుండ్రిదనం నుండి వ్రేలాడుతూ సన్నగ, పొడుగ్గ, పసిడి రంగులో ఎంత అందంగా ఉండేవని! ఆమె జుత్తును రోజుకో రకంగ అలంకరించుకునేది. ఒకొరోజు రెండు జడలు వేసుకునేది. అవికూడా ఒకోసారి సన్నటి పాముల్లా వెనక్కి వ్రేలాడుతూ, ఒకోసారి రెండూ బుజాలమీదగా ముందుకుపాకుతూ, ఇంకోసారి ఒకటి ముందుకు ఒకటి వెనక్కి, అలా ఒకోరోజూ ఒంటి జడ బారుగా వీపుమధ్యనుండి పిరుదుల మీద గంతులేస్తుండేది. ఇంకోరోజు జుట్టుముడి వేయబడి ఉండేది. అలా ముడి వేయబడ్డప్పుడు ఆమె మెడ నగ్నంగాఉండి నన్నెంత పిచ్చెక్కించేదని!

రోజూ పుస్తకాలు పుచ్చుకుని ఉదయంపూట ఆమె ఉండే ఇంటి తోటలోకి వరండాలోకి కిటికీవేపో చూచుకుంటూ ఆవీధినే కాలేజికి నడిచి వెళ్ళేవాణ్ణి. ఆమె కూడా విధిగా కనిపించెది, రాచకన్యలా పూదోటలో ఠీవిగా తిరుగులాడుతూ మధ్య

మధ్య ఒంగుని వేళ్ళతో పూలని పరామర్శిస్తూ నాబూట్ల చప్పుడుకు సుతారంగా తలతిప్పి చూసేది. చిన్ని ఆమె పెదవులు సాగి దరహాసంతో తెల్లటి పలువర సని బయట పెట్టేవి. ఎప్పుడైనా నేను ఆలస్యంగా వెళ్ళటంతటస్థిస్తే ఆమె వరండాలో అసహనంగ పచార్లు చేస్తుండేది, ఆయింటి ముందుకురాగానే బూట్ల చప్పుడు పెద్దవి చేసేవాణ్ణి. తలను ఆలా దర్పంగా ఒక పక్కకు నావేపు ఒంచి నిర్లక్ష్యంగా కళ్ళు చిట్లించి గుమ్మం కర్టెన్ వెనక్కు తప్పుకునేది. నా ఆలస్యానికి చికాకని తెలిసిపోయేది. అట్లా ... ఎన్నని చెప్పేది. రోజుకో భంగిమలో ఆమె నాహృదయానికి ఊపిరి పోసేది. గొప్ప నర్తకి లక్షణాలన్నీ ఆమెలో ఉన్నాయి.

" ఒక రాత్రి ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయాన, ఆమె ఒక్కతే ఉన్నదని తెలిసి సాహసంచేసి లోపలికి వెళ్ళాను " అవధాని చెప్పటం ఆపి అన్నాడు. " ఇంకా విపులంగా చెప్పమంటావా? "

" నీయిష్టం "

" నీకంత ఇంట్రెస్టు లేదన్నమాట! "

ఎందుకులేదు! నిన్ను కదిలించే సంఘటనలు మాత్రం చెబుతున్నావని తెలుస్తోందిగా..."

" సరే ... చెక్క గేటు తోసుకుని లోపల తోటలో ప్రవేస్తుంటే నాకాళ్ళు వణికాయి. వరండాలోకి వెళ్ళి తలుపులు తట్టాను. తెరుచుకుంది. ఎదురుగా ఆమె నిలువుగా నాఎత్తు. నీలం చీర, చిలకపచ్చరంగు స్లీవ్‌లెస్ జాకిట్టులో, లైటు వెలుగులో మెరుసిపోతోంది. "

" ఏంకావాలి మీకు? అన్నది. "

" 'మీకోసమే... ' నాస్వరం వణకకుండ ఉండటానికి ప్రయత్నించాను."

" లోపలికి రండి! "

" నావెనకే తలుపులు మూసేసింది "

" జీవితంలో నాకది తొలి అనుభవం ఉపోద్ఘాతంగా ఏం చెయ్యాలో లేక ఏం మాట్లాడాలో తెలియకపోవటం కాదుగాని ఇంకా నాలో ఏమూలో బెరుగ్గాఉంది. వెళ్ళి పక్కగా ఉన్న పడక కుర్చీలో కూర్చుంది. ఆమె వెనగ్గా టేబుల్‌మీద ఒక రేడియో, కొన్ని పుస్తకాలు కనిపిస్తున్నాయి ఆమె చీర కుచ్చెళ్ళు ఒత్తుగ ఆమె పాదాలమీద కుప్పబోసుకున్నాయి.

" ఊఁ .... చెప్పండి, అన్నదామె. "

" ఉలికిపడ్డాను. నాలో రక్తం పోటెక్కింది,

" ' అబ్బే! ఏమీలేదు: ' అన్నాను కలవరంగా.

" ' ఏమీలేదా? ' నవ్వింది ఆమె.

" ఆమె బుజాలవేపు దృష్టివుంచి చూస్తున్నాను.

" కాసేపు గడిచింది నిశబ్దంగా.

" ఆ చేతులు!_ ముద్దుపెట్టుకోవాలనిపించింది. ఆశరీరాన్ని కావలించుకోవాలనిపించింది. కాని... నా నాసికా రంధ్రాల్లోను, హృదయాంతరాళాల్లోను, ఏదో అనూహ్యమైన ఏహ్యత నారక్తాన్ని చల్లబరచ ప్రయత్నించింది. ఉండి ఉండి ఈ ఏహ్యత బాహ్యాన్నుండి, నాలోపలికి నానరాల్ని జలదరింపజేస్తూ సాకుతోంది....

" ' ఇందుకేనా? ఇంతేనా? ' అడిగిందామె.

" ఆమె వక్షంమీద పయిట జారింది చిన్ని రొమ్ములు.

ఆమె చేతులు జాస్తోంది. తల విదిలించి చప్పున లేచి నిలబడ్డాను తలుపులు తెరుకుని పారిపోతున్నవాడిలా విసురుగా బయటికి వచ్చాను. అంతే ఆతర్వాత..."

" అదేమిటి? " మధ్యలో సత్యం అడిగాడు ఆశ్చర్యంగా.

సమాధానంగా అవధాని నవ్వు వినిపించింది.

" అచ్చా! ... ఒక మనిషి _ ముఖ్యంగా ఒక స్త్రీని_ కవితా దృష్టిలో ఆమె కళ్ళ తళుకుల్ని, చెంపల మెరుపుని, వంటి నునుపుని,మాత్రమే దృష్టిలో ఉంచుకోవటము కాక, ఆమెకూడా మమూలు మనలాటి మనిషేననీ, ఆమెకు కూడ లోపల జీర్ణాశయము, చిన్నపేగులు, పెద్దపేగులు, అవీ ఇవీ ఉంటాయనీ, తరచుగా అవిహాటి పనిని నిర్వర్తించటంలో కొన్ని ఇబ్బందు లేర్పడతాయనీ, జీర్ణమే కాక అజీర్ణంలాంటివి కూడ సంభవిస్తుంటవనీ ... ఇట్లాంటివి ఊహించలేకపోవటం, వాస్తవంలో కొచ్చినప్పుడు వాటిని తట్టుకోలేకపోవటం అన్నది నాలాంటి వాళ్ళ మనోబలహీనతకో లేక మూర్ఖత్వానికో చిహ్నమే ననుకోవాలి. "

ముందు సత్యానికి అర్థంకాలేదు.

"ఎలర్జీ అన్నమాట!!" ఒక్కసారిగా ఫక్కుమన్నాడు. అవధానికూడ గొంతు కలిపాడు. ఇద్దరూ తెరలు తెరలుగ నవ్వసాగారు, లోపలినుండి తోసుకొస్తున్న నవ్వునాపుకోలేక సత్యం మరీ ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు.

'ఏమైనా నువ్వు పెద్దఫూల్ వోయ్ అవధానీ"

టక్కున ఇద్దరినవ్వులూ ఆగిపోయాయి

ఆ స్వరం శాపవది!

# 2

నాలుగేళ్ళు గడిచాయి.

"అవధానిగారు మీకు తెలుసుకుగా?" అన్నాడోరోజు జానకి సత్యంతో.

సత్యం జానకిని పెళ్ళాడి మూడేళ్లు దాటింది. ఏడాది పిల్లవాడుకూడా వాళ్లకు.

'అవును. ఏం?' అన్నాడతను.

"వాళ్ళిద్దరూ విడాకులిచ్చుకున్నారటండీ!"

"ఎవరిద్దరు?"

"వాళ్లేనండీ, మొగుడూ పెళ్ళాలు. అవధాని, అతని పెళ్ళామూను...."

సత్యం ఆశ్చర్యంలోపడ్డాడు. ఏడాదికిత్రితం వాళ్ళ బాబాయి పోరుపడలేకా పడలేకా అవధాని ఈ పెళ్ళి చేసుకున్నాడు. పెళ్ళికి సత్యంవెళ్లాడుకూడ. పెళ్ళి కూతురు బియ్యే పాసయింది. సన్నగ, నాజూగ్గ, అందంగానే ఉంటుంది. ఏడాది లోనే ఆ సంసారం ఛిద్రమైందీ అంటే అతనిలోనో ఆమెలోనో ఏదో పెద్దలోపం ఉండి వుండాలి అనిపించింది, సత్యానికి.

"అది కాదండీ..." జానకి ఒంగుని రహస్యం చెబుతున్నట్లుగా గుసగుస స్వరంలో అంది, "ఆ పిల్లే అతనికి విడాకులిచ్చేసిందట!"

'ఛా!?"

'అవునండీ'

'నీకెట్లా తెలుసు?" సందేహంగా అడిగాడు సత్యం?

'బాగుంది.... అవధానిగారిపొలాలు మా అక్కయ్యగారి ఊళ్ళోకాదాఏమిటి ఉంట? అతనిప్పుడు అక్కడే ఉంటున్నాడంట, అక్కయ్య ఉత్తరం రాసింది. అంతకుమునుపు ఆ పొలాలు. మామిడితోట అవన్నీ ఎవరో కౌలుకు చేసేవాళ్లు. పెళ్ళాం విడాకులిచ్చేయగానే అతను వచ్చేసి తోటలో చిన్న యిల్లు కట్టుకుని, ఇద్దరు జీతగాళ్ళను పెట్టుకుని, యిప్పుడు తనే సాగు చేసుకుంటున్నాడట."

మూడేళ్ళక్రితం అవధాని. సత్యం యిద్దరూ కావాలనిప్రాజెక్టునుండి ట్రాన్స్ ఫర్ చేయించుకున్నారు, అవధాని హైదరాబాద్‌లోను. సత్యం బెజవాడలోనూ. యిద్దరిమధ్యా ఉత్తరప్రత్యుత్తరాలు అతితక్కువగా సాగుతుండేవి. అప్పుడైనా ఏదో యథాలాపంగా— స్నేహం చెడకుండా ఉండటానికన్నట్లు రాసుకునేవారు. ఆ

కారణంవల్ల సత్యానికి అవధాని సంగతులు అంత విపులంగా తెలిసేవికావు. అవధానినుండి అతనికి ఉత్తరం వచ్చి ఆరునెల్లు దాటుతోంది.

"ఐతే అంత మంచి ఉద్యోగాన్నీ వదిలేసాడన్నమాట!" అన్నాడతను.

"అలాగే అనుకోవాలి."

వారంరోజులతర్వాత రాఘవనుండి సత్యానికి ఒక ఉత్తరం వచ్చింది.

సత్యం,

నీకు తెలుసో తెలియదోగాని అవధానికి అతని పెళ్ళాం విడాకులిచ్చేసింది. కారణం అతనిలో మగతనం లేకపోవటమేనని ఆమె తన మిత్రురాళ్ళతో చెప్పుకుంటుందట.

నువ్వు నమ్మవు. నాకు తెలుసు. కాని ఒకటి— ఒక మనిషిలో పూర్తిగా వెలితిని చూడటానికి ప్రయత్నించే నేనెంత ఇల్యూజన్‌లో ఉన్నానో ఒకరిలో సంపూర్ణత్వాన్నిచూడాలని తాపత్రయపడేనీవూ అంతే ఇల్యూజన్‌లో ఉన్నానన్నది మాత్రం నత్యం..."

ఈ ధోరణిలో ఉందా ఉత్తరం. సాంతం చదివాక సత్యం ఒక నిట్టూర్పు విడిచాడు.

## 3

మరో మూడేళ్ళు గడిచాయి. మానవజీవితంలో మూడేళ్ళ కాలంలో రకరకాల సంఘటనలు ఏదైనా జరగొచ్చు... అవధాని ఎవరో తురక యువతిని ఉంచుకున్నాడన్న సంగతి అతన్ని తెలిసిన వాళ్ళనందరినీ దిగ్భ్రాంతుల్ని చేసింది. జనానికి అతనో మిస్టరీగా తయారయ్యాడు. కొంతమంది అదో పై ముసుగుగా భావించారు. అలా అన్నారుగూడా. కాని ఏడాదితర్వాత ఆ తురకయువతి కడుపుతో వుందని తెలిసినప్పుడు ఆ ఫలితానికి అవధాని పురుషత్వం కారణమని యెవరూ నమ్మలేదు. అవధాని మిత్రుల్లో ముఖ్యంగా అతని యింటికి వచ్చేవాళ్ళలో అంతటి పుణ్యాత్ములెవరా అని ఆరాలు తీయ ప్రయత్నించాడు. కాని అవధాని ముభావ స్వభావి కావటం అతనికి దగ్గరి మిత్రులనదగ్గవాళ్లెవరూ లేకపోవటం వాళ్ళని కొంత నిరుత్సాహంలో ముంచింది... యిదంతా సత్యానికి కర్ణాకర్ణిగా ఎప్పటికప్పుడు తెలుస్తోనే వుంది.

"పూర్ ఫెలో!' అనుకున్నాడతను అవధానినిగురించి.

అవధానికి కొడుకు పుట్టిన అయిదు నెలలతర్వాత సత్యం ఆ ఊరు వెళ్ళటం తటస్థించింది. జానకి అక్కయ్య వాళ్ళింట్లో ఏదో పెళ్ళి జరుగుతోంది. ఇద్దరూ రావాలని జానకి బావ— సత్యం తోడల్లుడు— అతనికి మరీ మరీ చెప్పి వెళ్ళాడు. తను పెళ్ళినాటికి వస్తానని చెప్పి సత్యం ఒకవారం ముందుగా జానకిని రైలు ఎక్కించాడు.

పెళ్ళినాటి సాయంత్రానికి అతనా ఊరు చేరుకున్నాడు. వెళ్ళగానే అతనికి జానకి చెప్పింది.

"మీరు రాగానే తననొకమారు కలుసుకోమని మీ అవధానిగారు కబురు పంపాడండీ."

"ఎవరు చెప్పారు?"

'ఆ తురకదాన్ని పంపాడు.'

సత్యం మాట్లాడలేదు.

"అదెంత కలుపుగోలుగా ఉంటుందనుకున్నారూ! ఈ వారం రోజుల్లోనూ నాలుగు సార్లు వచ్చిందిక్కడికి. అప్పుడే నాతో స్నేహం కలుపుకుంది."

'ఎట్లా ఉంటుంది మనిషి?"

భర్తవేపొకమారు పరిశీలనగా చూసిందామె. ఆ చూపుల్లో కోపముంది. తిరస్కారం ఉంది. అసహనముంది.

"నా మొహంలా!" చరుగ్గుమని లోపలికి వెళ్ళిపోయింది.

సత్యం నవ్వుకున్నాడు.

ఆ రాత్రి ఆ యింట్లోని పెళ్ళి అయిపోయింది. సత్యం మర్నాడుసాయంత్రం వెళ్ళిపోవటానికి నిశ్చయించుకున్నాడు. ఆ మధ్యాహ్నం అతను అవధానివద్దకు వెళ్ళటానికి సిద్ధమవుతుంటే జానకి అన్నది.

"నేనుకూడ వస్తానండీ"

"నువ్వెందుకు?"

"మీకు దారి తెలియదుగా," నవ్వింది.

"పరవాలా. జీతగాణ్ని తీసుకువెళతాను."

కోపంగా చూసిందామె.

"మీరలా మాట్లాడతారేమిటి? ఆ షమీమ్ నాకు స్నేహితురాలే తెలుసా?"

"కాని నువ్వామెను ఇష్టపడవనుకుంటా?"

ఉడుక్కుందామె.

ఆఖరికి ఇద్దరూ కలిసే వెళ్ళారు.

తోటమధ్యలో ఉందాఇలు మట్టిగోడలు, రెల్లుకప్పు.

అవధానిలో చాలా మార్పును గమనించాడు సత్యం. అతనాశించినట్లు అతన్ని చూడగానే అవధాని ఏ ఉత్సాహాన్నీ ప్రదర్శించలేదు. నిదానంగా, నిబ్బరంగా, పెద్దమనిషిలా పలకరించాడు

"వచ్చావన్నమాట!'

ఇంకో విషయంలోనూ సత్యం ఆశాభంగం చెందాడు. షమీమ్ గురించి ఏ గొప్ప అందగత్తెగానో భావించాడతను. కాని అవధాని పక్క నిల్చున్న రూపంలో ఏ అందమూ కనిపించలేదతనికి ఆమె కాస్త నలుపనే చెప్పాలి. ఎత్తూ కాదు. పొట్టీకాదు, లావూకాదు, సన్నమూకాదు, మధ్యరకం పల్చటి చెంపలు, లావు చిన్న నుదురు, ఆమె నవ్వుతున్నప్పుడు పళ్ళు కొంచెం ఎత్తుగా కనిపించాయి. కాని తెల్లగా మెరిసిపోతూ, ఒక్క కళ్ళలోమాత్రమే అందమో, ఆకర్షణో ఏదో కొట్టవచ్చేటట్లు కనిపిస్తోంది. ఏమి చూసి అవధాని ఈమెను తెచ్చుకున్నాడా అని పించింది సత్యానికి.

జానకిని షమీమ్ ఇంట్లోకి తీసుకువెళ్ళింది. సత్యం అవధానివెంట తోటంతా కలియదిరిగాడు. మూడెకరాల తోట ఎక్కువభాగం మామిడిచెట్లు, కాయలు విరగ గాసాయి. దక్షిణంవేపున ఓ పక్కమాత్రం కొద్దిగా జామి, నారింజ, ఒకటిరెండు నిమ్మచెట్లు, ఉన్నాయి. తోట పక్కనుంచి ఒక వాగు పాకిపోతోంది, అందులో నీళ్ళంతగా లేవు.

మిత్రులిద్దరూ ఇంటికి కొంచెం దగ్గరలో ఎడమవేపునఉన్న ఒక గుబురు చింత చెట్టుకింద కూర్చున్నారు తోటమధ్యలోని ఆచెట్టుఉనికి సత్యానికి కాస్త వింతగానే అనిపించింది. గొడుగు పట్టినట్లు చింతనీడ గుండ్రంగా చెట్టుచుట్టూ పరచు కుంది. సత్యం చెట్టుమొదలు నానుకుని కాళ్ళుజాపుకుకూర్చున్నాడు. అవధాని కొంచెం అవతల వెల్లకిలా పడుకుని ఆలోచిస్తున్నట్లు పైకి చూడసాగాడు కొమ్మల మధ్యనుండి పిచ్చుకలు ఊరికే గొడవచేస్తున్నాయి.

అంతా బాగానే ఉందికాని, నీసంసారం సంగతే నాకు అంతుపట్టటంలేదు..." అన్నాడు సత్యం.

" నా సంసారానికేం, బాగానే ఉందిగా? "

"సంసారమంటే సంసారమని కాదు, ఆస్కాండల్సు సంగతి?" సవాళ యిస్తూనే అడిగాడు.

"ఏది? ... నేను గాక నీలే నాకు విడాకులిచ్చేసిందన్న విషయమేనా?

"నీకు తెలుసన్నమాట?"

"తెలుసేమిటి, అది నిజమే."

ఉలికి పడ్డట్లు చూసాడు సత్యం.

"మరీ అంత 'స్టాయిక్' గ మాట్లాడకు."

అవధాని మాట్లాడబోయేంతలో దగ్గరగా ఆడవాళ్ళ స్వరాలు వినిపించాయి. ప్లేటులనిండా మామిడిముక్కలు, రెండుపెద్దగ్లాసులతో షర్బత్ తీసుకుని జానకి షమీమ్ లొచ్చారు. మిత్రులిద్దరూ మామిడిముక్కలు తింటుంటే అవధానితో షమీమ్ అంది.

"ఈ మనతోట, ఇల్లు, ఇదంతా పూర్వకాలపు పర్ణశాలలా ఉందటండీ అక్కయ్య అంటోంది."

అవధాని చిరునవ్వు నవ్వాడు.

"అంతే కాదు, మనం ముని దంపతుల్లాకూడాఉన్నామట." షమీమ్ పక పకా నవ్వింది.

తనభార్త కొద్దిగ సిగుపడటాన్ని గమనించాడు సత్యం.

స్త్రీలిద్దరూ గ్లాసులు, ప్లేటులు, తీసుకుని ఇంటివైపు నడుస్తుంటే వెనుక నుండిచూస్తూన్న సత్యం షమీమ్ నడకలో అందానికి తనలో తాను మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు

"షమీమ్‌ను చూసావుగ!"

అవధాని స్వరానికి ఉలికిపడ్డట్లు చూసాడు సత్యం తనభావాలు మిత్రుడెక్కడ గ్రహించాడోనని అవనసరంగా భయపడిపోయాడు.

"ఆ నడక, ఆ కళ్ళు..." ఇంత సేపటినుండి క్లుప్తంగా మాట్లాడుకొచ్చిన అవధాని ఇప్పుడు హృదయంవిప్పి సుదీర్ఘ సంభాషణ చేసాడు. "ఎక్కడో గుండెల లోపలనుండె తొల్చుకొస్తున్నట్లు ఆమె చూపులు .... సత్యం, జీవితం నాకిప్పుడు కొస్త సుఖకరంగా అనిపిస్తోంది, జీవితానికి అవసరమైనంతలో ఫిలాసఫీని ఏర్పరుచుకున్నాను. మనుష్యుల్లోని .... షమీమ్ నన్ను చక్కగా అర్థంచేసుకున్న మనిషి. 'పెళ్లిచేసుకుందామా?' అని అడిగినప్పుడు, "అవసరమా? మీకంత

అవసరమనిపిస్తే నాకభ్యంతరంలేదు, అన్నది, భార్యగా ఆమెను బంధాల్లో ఉంచటం నాకిష్టంలేదు, మూడెకరాల మాగాణీని ఆమెపేర రాసాను. తన ఇష్టమొచ్చినప్పుడు ఆమె వెళ్ళిపోవచ్చు అవి అమ్ముకుని గాని, ఎట్లాగయినా..."

గట్టిగా నిశ్వసించాడు అవధాని. కాసేపు అలా చూస్తూ ఊరుకుని మళ్ళీ మొదలెట్టాడు

" ప్రస్తుతానికి జీవితం బాగానే ఉంది. ఇంతకంటె నేనెక్కువ ఆశించటం లేదుకూడా. ఒకవేళ ఏదయినా విపత్తు ఎదురైనా ఆశ్చర్యపడను. సిద్ధంగా నే ఉన్నాను... ఇక ఆస్కాండల్సు ...

" నా పదిహేనేళ్ళ వయస్సులో మాబాబాయి – మానాన్నకు స్వయనా తమ్ముడు – ఆయన చేతుల్లో అమ్మను నగ్నంగా చూసినప్పుడే నాలో మనుషుల మీద అంతకుమునుపున్న గౌరవాభిమానాలు తుడుచుకుపోయాయి. అతనంటే అప్పటిన్నించీనాలోద్వేషము, అసహ్యము, రోజురోజుకూపెరిగిపోయాయి. అతర్వాత ఇంజనీరింగు చదివేప్పుడు ఆయువతి సంగతి చెప్పేనుకదా ఆమెతో సంఘటననాలో మిగిలి ఉన్న సౌందర్యపు విలువల్ని ఊడగొట్టింది.

" అందుకే తర్వాత ఆబాబాయిగాడు తెచ్చిన సంబంధాలన్నీ తిరస్కరించాను కాని తప్పని సరై, స్కాండల్సునుండి తప్పించుకోవటానికి, లీలను పెళ్ళాడాను. లీల చదువుకున్న యువతి, బాబాయిగాడితో పూసుకుతిరగటము, గంతులేయటము, ఆవెధవేమొ చనువుగా వుంటూ వీలైనప్పుడల్లా స్పృశించటము అదీ–మొదట్లోనే నామనస్సుమీద పెద్ద దెబ్బతీసింది. ఉత్త సెంటిమెంటలే నిలిచింది. కాని సరి అయిన ఆధారం దొరికేవరకు నిరీక్షించ దలచుకున్నాను..... ఇంకోసారి తప్పనిసరిఅయిన సంఘటన జరగాల్సొచ్చింది. ఇద్దరం శోభనం గదిలో వంటరిగా ఎదురుపడ్డాము, చెప్పానుగా, ఆధారం దొరికే వరకు నిరీక్షించుదామని అనుకున్నానని: మూడు రాత్రులూ ఆమెను అంటలేదు. ఏవేవో ఆశలతో కోర్కెలతోఉన్న ఆమె నిరుత్సాహ పడింది. ఆరునెలలు ఇద్దరం ఒకే ఇంట్లో ఉంటూ ఎవరికెవరిమోగాగడపటం ఆమెకు నామీద అసహ్యాన్నో, ద్వేషాన్నో గాని కలిగించింది. అప్పటికే నాకింకా ఆధారం లభించలేదు. ఆమెకేమొ అసలు కారణం తెలియదు. ఒక రోజు అన్నది.

" ' ఎందుకీ బ్రతుకు, విడిపోతే పోలా? '

అప్పటికే ఆమె నామీద ఒకరకపు అలసభావాన్ని ఏర్పచుకుందని తెలుసు. " మంచిది " అన్నాను.....

సత్యం ఇదంతా ఆశ్చర్యంగా వింటున్నాడు. ఇంతలో ఒక చిత్రమైన సంఘటన జరిగింది.

జానకి విసురుగా వచ్చి రుద్ధ కంఠంతో అన్నది

" పదండి ఇక్కడింకొక్క క్షణమైనా ఉండొద్దు. "

ఆమె చెంపలవెంట కన్నీరు ధారలు కడుతోంది, అర్ధంకాని సత్యం తెల్లబోయి చూసాడు.

" ఏమిటమ్మా ఏం జరిగింది? అంటున్నాడు అవధాని

జానకి జవాబివ్వకుండా విసురుగా వీధివేపు నడిచింది. మిత్రులిద్దరూ గాభరాగా ఆమె వెంటబడారు. తోట చివరివరకు వచ్చిన అవధాని ఆగిపోయి అన్నాడు.

" బ్రదర్ పొరపాటేమయినా జరిగిఉంటే క్షమించండి "

సత్యం వినిపించుకోకుండా భార్య వెంట నడిచాడు. ఇద్దరూ వీధిలోకొచ్చారు. ఎండ మాడ్చేస్తోంది, దగ్గరలో మనుషులెవరూ లేరు.

ఇంక ఉండబట్టలేక సత్యం గద్దించి అడిగాడు

" ఏ సంగతీ చెప్పకుండా ఏమిటా ఏడుపు? "

జానకి భర్తమొహంలోకి నీళ్ళునిండిన కళ్ళతోచూసి గభాల్న రోడ్డుమధ్య కూలబడింది, ఏడుస్తూ వెక్కిళ్ళమధ్య చెప్పుకొచ్చింది

జానకి, షమీమ్ లిద్దరూ చాలా కలుపుగోరుగా అనేక విషయాల్నిగురించి మాట్లాడుకున్నారు. ఆఖర్న షమీమ్ సత్యాన్నిగురించి ఆతనెలా చూస్తున్నాడనీ అదీ ఇదీ అడిగిందట ఇదే నందని జానకి ఒక ప్రశ్న అడగకుండా ఉండలేకపోయింది. ఎంతసేపటినుండో అప్రశ్న అడగాలా వద్దా అని ఆమెలో ఘర్షణ సాగుతోంది.

" నీబిడ్డ అవధానివల్ల పుట్టినవాడేనా ' అడిగింది ఆఖరికి,

" యాడవలేకపోయావ్! " సత్యం రౌద్రంగా అన్నాడు. " ఊఁ ఏమని జవాబిచ్చింది? "

జానకి భర్త మొహంలోకి చూసి మళ్ళీ బావురుమంది.

సత్యానికి విసుగుపుట్టింది.

" ఏడుపు సంగతి తర్వాత, ముందు చెప్పేచావు. " అన్నాడు అసహనంగా.

జానకి చెప్పింది,

" ఈరాత్రికి వచ్చి అవధాని పక్కలో పడుకుని చూడు " అందట షమీమ్

అవాక్కయి పోయాడు సత్యం. అతని అంతరాళాలో ఎక్కడో భర్తృ అహం దెబ్బతిన్నది.

" ఓస్సి దెయ్యపు మొహమా! " పెద్దగా అరిచాడతను. " అసలు నువ్వా ప్రసంగం ఎందుకుతీసుకు రావాల్సివచ్చింది? "